క్లుప్తంగా

మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పెళ్లకూరు: మండల కేంద్రమైన పెళ్లకూరులోని చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతికి చెందిన ఎస్వీ అరవింద కంటి ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. దృష్టి లోపం ఎక్కువగా ఉన్న వారిని శస్త్ర చికిత్సలు కోసం తిరుపతికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సీఈవో సీతారామయ్య, ఏవో కృష్ణ, సిబ్బంది భవాని, కార్తీక్, గుప్త తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదాలకు రూ.20 వేల వితరణ



పెంచలకోనలో ఎల్ఐసీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రాపూరు : పెంచలకోనలో నిర్వహించే లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఉచితంగా ప్రసాదాలు అందజేసేందుకు రూ.20 వేలు అందించినట్లు ఎల్ఐసీ నెల్లూరు డివిజనల్ మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన ఆదివారం పెంచలకోనలో ఎల్ఐసీ స్టాల్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల సమయంలో ఎల్ఐసీ తరఫున విరాళం ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐసీ సిబ్బంది జనార్దన్, వెంకటేశ్వర్లు, నాగయ్య, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య సేవలు చిరస్మరణీయం

నాయుడుపేట టౌన్ : ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య సేవలు చిరస్మరణీయమని సీపీఎం నాయకులు తెలిపారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మునిరాజా, ముకుంద, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు పద్మమ్మ, గిరిజన సంఘం నాయకులు మణెమ్మ, డీవైఎఫ్ఐ నాయకులు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి చేయూత

నాయుడుపేట టౌన్: పట్టణంలో ట్రాక్టర్ మోకానిక్‌గా పనిచేసే బాబు(50) వారం క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. ఈక్రమంలో బాబు కుటుంబ సభ్యులకు మెకానిక్‌లు, యూనియన్ నేతలు నగదు అందజేసి చేయూత ఇచ్చారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న నవజీవన్ సంస్థ ప్రతినిధులు

నాయుడుపేట టౌన్ : ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నవజీవన్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కె.బాలాజీ తెలిపారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా ఆదివారం సాయంత్రం స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సీహెచ్ కవిత, టి.శ్రావణి, కె.అనూరాధ, మంజుల, టి.నందిని పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



రాచపాళెంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ రవిబాబు

ఓజిలి: ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవిబాబు హెచ్చరించారు. ఆయన ఆదివారం రాచపాళెం ప్రజలతో మాట్లాడారు. తమకు ఓట్లు వేయలేదనే కారణంతో ఘర్షణకు పాల్పడే వారిపై నిఘా ఉంచినట్టు తెలిపారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత దాడులకు పాల్పడకుండా గస్తీ ఉంటుందని చెప్పారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో అవగాహన



పోలిరెడ్డి పాళెంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ తిరుమలరావు

దొరవారిసత్రం: ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో నాయకులు మాటలు విని ఘర్షణలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిరుమలరావు తెలిపారు. ఆయన ఆదివారం పోలిరెడ్డిపాళెం, తనియాలి, మావిళ్లపాడు తదితర గ్రామాల్లో పర్యటించారు.

జాతీయ రహదారి నుంచి వెదురుపట్టు గ్రామానికి నిర్మించిన తారు రోడ్డు, జాతీయ రహదారి నుంచి మినమనముడి గ్రామానికి వెళ్లే తారు రోడ్డు, కృష్ణాపురం ఎస్టీ కాలనీలో ఏర్పాటుచేసిన సీసీ రోడ్డు







బాగుపడిన రోడ్లు

రోడ్లు ప్రగతికి బాటలు అని పెద్దలు చెబుతారు. రోడ్లు బాగుంటే రవాణా పెరుగుతుంది. ఉత్పత్తులు, వస్తువులు ఒక చోటు నుంచి ఇతర ప్రాంతాలకు త్వరితగతిన చేరుకుంటాయి. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. గత ప్రభుత్వంలో సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్‌శాఖ రోడ్లు దారుణంగా ఉండేది. అడుగడుగునా గుంతలు పడి ప్రయాణం ఇబ్బందికరంగా ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని శాఖల పరిధిలో ఉన్న రోడ్లను బాగు చేసింది. గ్రామాల్లో మెటల్ రోడ్లను సీసీ రోడ్లుగా, మిగిలిన ప్రాంతాల్లోని రోడ్లను బీటీ రోడ్లుగా మార్చింది. గతంలోకంటే ఇప్పుడు రోడ్లపై ప్రయాణం సుఖంగా మారింది. (సూళ్లూరుపేట–కోట రోడ్డు) సూళ్లూరుపేట మండలాల్లోని పలు గ్రామాల మీదుగా దొరవారిసత్రం మండలంలోని తీర ప్రాంతాల వరకు ఆర్అండ్‌బీ శాఖకు చెందిన సుమారు 50 కిలోమీటర్ల రోడ్లను పీఆర్‌డీ ప్రాజెక్ట్ కింద రూ.50 లక్షలతో బాగు చేశారు.

– దొరవారిసత్రం

సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ రోడ్ల సంఖ్య 61
విస్తీర్ణం : 400 కిలోమీటర్లు
ఇందులో 100 కిలోమీటర్లు రోడ్లను రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.2 కోట్లతో బాగు చేసింది.
పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని రోడ్లు సంఖ్య 299
విస్తీర్ణం: 621 కిలోమీటర్లు
ఇందులో పీఆర్ శాఖ పరిధిలోని 34 పనులకు గాను 65 కిలోమీటర్ల రోడ్లను రూ.49.87 కోట్లతో తారు రోడ్లుగా మర్చారు.
సూళ్లూరుపేట, నాయుడుపేట వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కింద ఆరు మండలాల్లో 66 కిలోమీటర్లు రోడ్లను రూ.18 కోట్లతో నిర్మాణం చేశారు.





పెళ్లకూరు మండలం చెంబేడు రోడ్డు





ఓజిలి మండలం బట్లకనుపూరు రోడ్డు

- గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లుగా మారిన వైనం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు

మండలాలవారీగా పీఆర్ రోడ్లు...

సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఆరు మండలాల్లో 65 కిలోమీటర్లు మెటల్ రోడ్లను ఏఐఐబీ నిధులు రూ.49.87 కోట్లతో బీటీ రోడ్లుగా పూర్తి చేశారు. దొరవారిసత్రం మండలంలోని 14 కిమీటర్లు రోడ్లను రూ.10.14 కోట్లతో బాగు చేశారు. నాయుడుపేట రూరల్‌లో 18 కిలోమీటర్ల రోడ్లకు రూ.12.75 కోట్లు వెచ్చించారు. ఓజిలిలో రూ.9.38 కోట్లతో 13 కిలోమీటర్ల పొడవునా తారు రోడ్లు వేశారు. పెళ్లకూరులో 5పనులకు 7 కిలోమీటర్ల తారు రోడ్లకు రూ.7.70 కోట్లు వెచ్చించారు. సూళ్లూరుపేట రూరల్‌లో 6 పనులకు 8 కిలోమీటర్లు తారు రోడ్లు రూ.6 కోట్లు ఖర్చు చేశారు. తడలో 6 పనులకు గాను 8 కిలోమీటర్లు తారు రోడ్ల నిర్మాణానికి రూ.5 కోట్లు ఖర్చు చేశారు. అంతేకాకుండా పీఎంజీఎస్‌వై పథకం కింద పెళ్లకూరు మండలం చెంబేడు నుంచి దొరవారిసత్రం మండలం దుప్పలవారికండ్రిగ వరకు సుమారు 9 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణం, గ్రామాల్లో సీసీ రోడ్ల ఏర్పాటుకు రూ.8.36 లక్షలు వెచ్చించారు.

పీఆర్ రోడ్లకు మరమ్మతులు

సూళ్లూరుపేట, నాయుడుపేట సబ్ డివిజన్ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా ఆరు మండలాల్లో 26 పనుల కింద 66 కిలోమీటర్ల రోడ్లను రూ.18 కోట్లతో మరమ్మతులు చేపట్టారు. డీవీ సత్రం మండలంలో 6 పనులకు గాను 14 కిలోమీటర్ల రోడ్ల మరమ్మతులకు రూ.3.93 కోట్లు, తడలో 4 పనులకు గాను 7.7 కిలోమీటర్ల రోడ్లను రూ.1.81 కోట్లు, సూళ్లూరుపేటలో 6 పనులకు 12 కిలోమీటర్ల రోడ్లను రూ.2.72 కోట్లు, నాయుడుపేటలో 4 పనులకు గాను 14 కిలోమీటర్ల రోడ్లకు రూ.3.97 కోట్లు, ఓజిలిలో 2 పనులకు 5 కిలోమీటర్ల రోడ్లకు రూ.1.24 కోట్లు, పెళ్లకూరులో 4 పనులగాను 11 కిలోమీటర్ల రోడ్ల మరమ్మతులకు రూ.4.42 కోట్లు ఖర్చు చేశారు.

ఏళ్లనాటి కల నెరవేరింది



వెదురుపట్టు గ్రామం వలస విహంగాలైన ఎర్రకాళ్ల కొంగల సంతానోత్పత్తికి పేరు గాంచింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంత మంది అధికారులు వచ్చినా రోడ్డు సమస్య తీరలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత వెదురుపట్టు గ్రామం వరకు గత ఏడాది తారు రోడ్డు నిర్మాణం చేశారు. పలు గ్రామాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. దీంతో ఏళ్ల నాటి తారు రోడ్డు నిర్మాణం నెవేరింది.

– ఎస్.మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్, వెదురుపట్టు పంచాయతీ

గత ప్రభుత్వంలో ఆగిన పనులు పూర్తి



గత ప్రభుత్వంలో ఎన్‌హెచ్ నుంచి వయా మినమనముడి మీదుగా ఆర్అండ్‌బీ రోడ్డు వరకు తారు రోడ్డు పనులు మొదులు పెట్టి ఆపేశారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో సీసీ రోడ్లతో పాటు తారు రోడ్డు పనులను పూర్తి చేసింది. దీంతో ప్రయాణం ఎంతో సుఖంగా సాగుతోంది.

– బి.అరుణ, సర్పంచ్, మినమనముడి పంచాయతీ

ముత్యాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు





అమ్మవారి కుడి చేతి వద్ద కనిపిస్తున్న వెలుగు, ఆలయం వెలుపల కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం అద్భుతం చోటుచేసుకుంది. ఉదయం అర్చకులు అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ క్రమంలో ఒక భక్తుడు తన సెల్‌ఫోన్‌లో అమ్మవారి ఫొటో తీసేందుకు ప్రయత్నించాడు. అమ్మవారి కుడి చేయి వద్ద ఉన్నట్టుండి వెలుగు కనిపించింది. ఎన్నడూ లేని విధంగా వెలుగు కనిపించడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఈ విషయం తెలియడంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈవో నవీన్‌కుమార్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పర్యవేక్షించారు.

సాగరమాల రోడ్డు పనుల అడ్డగింత



నిరసన తెలుపుతున్న నాయకులు, రైతులు, గ్రామస్తులు

చిల్లకూరు : సాగరమాల రహదారి నిర్మాణ పనులు ఆదివారం పారిచెర్లవారిపాళెం వద్ద మూడు గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో కోల్‌కతా– చెన్నై జాతీయ రహదారి నుంచి తూర్పుకనుపూరు వరకు రూ.కోట్లతో చేపట్టిన సాగరమాల రోడ్డు పనుల్లో కాంట్రాక్టు సంస్థ బ్రిడ్జీలు నిర్మించాల్సిన ప్రాంతంలో కల్వర్టులు నిర్మిస్తోందని ఆరోపించారు. దీంతో పారిచెర్లవారిపాళెం పూర్తిగా ముంపులో మునిగి పోతుందన్నారు. ముత్యాలపాడు నుంచి పారిచెర్లవారిపాళెం వరకు సుమారు 1.50 కిలోమీటర్ల మేర పంట పొలాలు ఉన్నాయని, ఈ పొలాల్లో రోడ్డు నిర్మాణం చేపట్టారన్నారు. ప్రతి ఏటా భారీ వర్షాలు కురిసిన సమయంలో ఉప్పుటేరు పొంగి ఈ ప్రాంతం పూర్తిగా మునిగిపోతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ ఇరిగేషన్ అధికారులు మూడు బ్రిడ్జీలు నిర్మించాలని ప్రతిపాదనలు పెట్టినట్టు తెలిపారు.

దీనిపై తిరుపతి ఎంపీ గురుమూర్తి కూడా గతంలో అధికారులకు లేఖ రాశారని పేర్కొన్నారు. ఇప్పుడు ఇక్కడ పనులు చేస్తున్న సంస్థ వాటిని పట్టించుకోకుండా మూడు ప్రాంతాలలో 100,800, 80 మీటర్ల చొప్పన బ్రిడ్జీలు నిర్మించకుండా కల్వర్టులు నిర్మించేందుకు సిద్ధమైనట్టు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పొలాల్లో వెళ్లేందుకు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. పొలాలను దున్నితే ఐదు కీమీ దూరంలోని నాంచారమ్మపేటకు వెళ్లి పొలంలో పనులు చేసుకోవాల్సి వస్తుందన్నారు. అలాగే కల్వర్టులు నిర్మిస్తే ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరు పోవడానికి వారం రోజులకు పైగా సమయం పడుతుందని, అప్పుడు గ్రామం ముంపునకు గురవుతుందని వాపోయారు. ఇకనైనా సంస్థ ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలు, తిరుపతి ఎంపీ ఇచ్చిన లేఖను పరిగణలోకి తీసుకుని బ్రిడ్జీలు నిర్మించాలని కోరారు. నాయకులు వరదిరెడ్డి రామోహన్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, హైకోర్టు న్యాయవాది రవీంద్రబాబు, రషీద్, నూరుల్లా పాల్గొన్నారు. ఈ విషయపై సంస్థ ప్రతినిధి ప్రసన్నను వివరణ కోరగా ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలను సంస్థ యాజమాన్యానికి పంపించినట్టు తెలిపారు. ఎన్నికల కారణంగా ఆలస్యం అవుతుందని, త్వరలో నిర్ణయం తీసుకుని బ్రిడ్జీలు నిర్మించేలా చూస్తామన్నారు.

గొల్లబొయిన ఆలయం వద్ద శ్రీవారికి పూజలు చేస్తున్న అర్చకులు



అంగరంగ వైభవం



స్వామి వారికి అడవి గడ్డలు సమర్పిస్తున్న అర్చకులు



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు



స్వామివారికి గిరిజనులు సమర్పించిన తేనే, గడ్డలు, ఆరినార మొలతాడు

పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా స్వామి వారు ఆదిలక్ష్మి, చెంచులక్ష్మితో కలిసితో గోనుపల్లిలోని అత్తారింటి నుంచి కోనకు చేరుకున్నారు. తర్వాత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

– రాపూరు



విద్యుత్ దీపాలంకరణలో స్వామి వారి ఆలయం

22న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

వెంకటగిరి రూరల్ : ఈనెల 22న పౌర్ణమి నేపథ్యంలో వెంకటగిరి నుంచి తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. ప్రస్తుతం మూడు ప్రత్యేక బస్సులను కేటాయించినట్లు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగులకు కూరగాయల పంపిణీ



దివ్యాంగులకు కూరగాయలు అందజేస్తున్న జేవీవీ సభ్యులు

గూడూరు రూరల్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులకు కూరగాయలు, కోడి గుడ్లు పంపిణీ చేశారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గత 32 సంవత్సరాలుగా మూఢ నమ్మకాలపై పలు కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లో సైన్సుపై అవగాహన పెంచుతున్నట్టు పేర్కొన్నారు. అలాగే ప్రతి నెలా 9వ తేదీన ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు పరీక్షలు చేసే సమయంలో వారికి పౌష్టికాహారం అందజేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం దివ్యాంగులకు జన విజ్ఞాన వేదిక వైస్ ప్రెసిడెంట్ రామమోహన్ దాతగా వ్యవహరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీవీ సభ్యులు చెంచునారాయణ, జగదీష్, నక్కా గోపి, గుర్రం జాషువా, పవన్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందజేస్తున్న ఆటో కార్మికులు

ఓజిలి: కమ్యూనిస్ట్ నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం ఓజిలి బస్టాండ్ సెంటర్‌లో ఆటో కార్మికులు మజ్జిగ పంపిణీ చేశారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ప్రజలకు మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మహబూబ్‌భాషా, కార్మికులు భాస్కర్, కాలేషా, జంషీద్‌భాషా, సాయిప్రసాద్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పరిశీలన

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఆదివారం 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేసి నీటిని శుద్ధి చేసి సరఫరాచేయాలని అధికారులను కోరారు.

కలవకొండలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కలశాలను ఏర్పాటు చేస్తున్న వేద పండితులు

చిల్లకూరు : మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నరసింహస్వామి జయంతిని పురస్కరించుకుని ఆరు రోజులు పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వేద పండితులు కలశ స్థాపన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సోమవారం ధ్వజారోహణం నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.